నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
25 జూన్ 2025
పేజీలు 8

నల్సార్-సైబర్ సెక్యూరిటీ

సైబర్ నేరాలను మరింత సమర్థంగా అదుపు చేసేందుకు తీసుకుంటున్న చర్యలో భాగంగా నల్సార్ విశ్వవిద్యాలయంతో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. బ్యూరో సిబ్బందికి సైబర్ చట్టాలపై అవగాహన పెంపొందించడంతో పాటు విధానాల రూపకల్పనలో పరిశోధన, సైబర్ ఫోరెన్సిక్ సామర్థ్యం పెంపొందించడం లక్ష్యంగా ఈ ఒప్పందం కుదిరింది.

రోజులు-ప్రాముఖ్యం

జూన్ 20

- ఏటా జూన్ 20న ప్రపంచ శరణార్థులు రోజుగా నిర్వహిస్తారు. హింస, వేధింపులు, ఉగ్రవాదం తదితర కారణాలతో స్వదేశాన్ని విడిచి రక్షణ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిని శరణార్థులుగా పేర్కొంటారు.

జూన్ 18

- ఏటా జూన్ 18న విద్వేష భావజాల వ్యతిరేక రోజుగా నిర్వహిస్తారు. అన్ని ప్రజాస్వామ్య దేశాల్లో భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుంది. అయితే దీన్ని దుర్వినియోగం చేసి ఇతరుల పట్ల విద్వేష పూర్వకంగా మాట్లాడకుండా ఉండటానికి అవగాహన కల్పిస్తారు.

జూన్ 17

- ఏటా జూన్ 17న ఎడారీకరణను ఎదుర్కొనే రోజుగా నిర్వహిస్తారు. ఒక ప్రాంతం ఎడారిగా మారకుండా ఏం చేయవచ్చో అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన రోజు ఇది. ఈ ఏడాది ఇతివృత్తం 'నేల పునరుద్ధరణ, అవకాశాలను అందిపుచ్చుకోవడం (రీ స్టోర్ ది ల్యాండ్, అన్‌లాక్ ది ఆపర్చునిటీస్)'. అలాగే ఏటా జూన్ 17న ప్రపంచ మొసళ్ల రోజుగా కూడా నిర్వహిస్తారు. దేశంలో ఆపరేషన్ క్రొకడైల్‌ను 1975లో ప్రారంభించారు.

జూన్ 15

- జూన్ 15న ప్రపంచ పవన రోజుగా నిర్వహిస్తారు. పవన విద్యుత్ ప్రాధాన్యాన్ని తెలిపేందుకు ఉద్దేశించిన రోజు ఇది.

జూన్ 14

- ఏటా జూన్ 14న రక్తదాతల రోజుగా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఇతివృత్తం 'గివ్ బ్లడ్, గివ్ హోప్: టుగెదర్ వ్యూ సేవ్ లైవ్స్'.

అంతర్జాతీయం

జీ7 సమావేశం

- అడవులను పరిరక్షించడంతో పాటు క్రిటికల్ మినరల్స్ విషయంలో పరస్పర అవగాహనతో కొనసాగాలని జీ-7 కూటమి నిర్ణయించింది. ఈ కూటమి సమావేశం జూన్ 15 నుంచి 17 వరకు కెనడాలో నిర్వహించారు. భారత్ సభ్య దేశం కానప్పటికీ కెనడా ఆహ్వానం మేరకు ప్రధాని నరేంద్ర మోదీ సమావేశానికి హాజరయ్యారు. పునరుత్పాదక శక్తి అవసరం, బాధ్యతాయుతమైన కృత్రిమ మేధ, పేద-అభివృద్ధి చెందుతున్న దేశాలకు సాయం తదితర అంశాలపై మోదీ మాట్లాడారు.

యూఎన్‌జీఏ

- ఏకపక్షంగా బలవంతపు చర్యలు తీసుకోకుండా అవగాహన కల్పించేందుకు ఒక రోజు ఉండాలని ఐక్యరాజ్య సమితి సాధారణ సభ భావించింది. ఇందుకు డిసెంబర్ 4ను ఎంపిక చేసింది. 193 మంది సభ్యులున్న సాధారణ సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టగా అనుకూలంగా 116 ఓట్లు వచ్చాయి. 51 దేశాలు వ్యతిరేకించగా, ఆరు దేశాలు గైర్హాజరయ్యాయి. తీర్మానం ఆమోదం పొందినందున ఏటా డిసెంబర్ 4న ఏకపక్ష బలవంతపు చర్యల వ్యతిరేక రోజుగా నిర్వహిస్తారు.

ప్రపంచ విద్యా పర్యవేక్షణ బృందం

- ప్రపంచ వ్యాప్తంగా 272 మిలియన్ల మంది ప్రజలు పాఠశాల వెలుపల ఉన్నారని యునెస్కో విడుదల చేసిన ప్రపంచ విద్యా పర్యవేక్షణ బృందం నివేదిక పేర్కొంది. 2025లో ఈ సంఖ్య పెరగొచ్చని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది.

ఆకలి ఇబ్బందులు

- ప్రపంచ వ్యాప్తంగా 13 ప్రదేశాల్లో ఆకలి ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయని ఆహార-వ్యవసాయ సంస్థ, ప్రపంచ ఆహార సంస్థలు సంయుక్తంగా విడుదల చేసిన నివేదికలో పేర్కొన్నాయి. వీటిని 'హంగర్ హాట్ స్పాట్'లుగా ప్రకటించాయి. ముఖ్యంగా గాజా, సూడాన్, దక్షిణ సూడాన్, హైతీ, మాలీ అధికంగా కరవు పరిస్థితులను ఎదుర్కోనున్నాయని నివేదిక పేర్కొంది.

వియత్నాం

- ఆగ్నేయాసియా దేశాల్లో ఒకటైన వియత్నాం బ్రిక్స్ కూటమిలో 'భాగస్వామ్య' దేశంగా చేరింది.

శక్తి విన్యాసం

- భారత్, ఫ్రాన్స్ దేశాల సైన్యాల మధ్య శక్తి విన్యాసం జూన్ 18న ప్రారంభమైంది. జూలై 1 వరకు కొనసాగుతుంది. దక్షిణ ఫ్రాన్స్‌లోని లర్‌జక్ క్యాంప్‌లో ఈ విన్యాసాలను నిర్వహిస్తున్నారు.

సముద్రప్రణాళిక

- 'మన సముద్రం, మన భవిష్యత్, తక్షణ కార్యాచరణకు ఏకం అవుదాం' అనే ఇతివృత్తంతో ఫ్రాన్స్‌లోని నైస్‌లో ఐక్యరాజ్యసమితి సముద్ర సదస్సు నిర్వహించారు. జూన్ 8న ప్రారంభమై 13న ముగిసింది. 2030 నాటికి కనీసంగా 30% జల జీవ వైవిధ్యాన్ని పునరుద్ధరించాలని, అలాగే సముద్ర రక్షణ, సుస్థిర మత్స్య రంగానికి 1 బిలియన్ యూరోలు కేటాయించాలని తీర్మానించారు.

జాతీయం

ఆపరేషన్ సింధు

- ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య దాడి, ప్రతి దాడుల నేపథ్యంలో భారత్ ఆపరేషన్ సింధు చేపట్టింది. ఇరాన్‌లో విద్య, ఉద్యోగాల కోసం వెళ్లిన భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తీసుకు వచ్చేందుకు ఉద్దేశించిన కార్యక్రమం ఇది.

విద్య సూచీ

- 2023-24 విద్యా సంవత్సరంలో ఉత్తమ పాఠశాల విద్య ర్యాంకింగ్‌లతో చండీగఢ్ అగ్రస్థానంలో నిలిచింది. విద్య అందుబాటు, మౌలిక సదుపాయాలు, విద్యా పరిపాలన, ఉపాధ్యాయుడి విద్య, అభ్యసన ఫలితాలు తదితర అంశాల ఆధారంగా ఈ సూచీని నిర్మించారు. చండీగఢ్ అగ్రస్థానంలో ఉండగా తర్వాత పంజాబ్, ఢిల్లీ, గుజరాత్, కేరళ నిలిచాయి. విద్య అందుబాటు విషయంలో తెలంగాణతో పాటు బీహార్ పురోగతిని సాధించింది. అలాగే మౌలిక సదుపాయాల విషయంలో కూడా తెలంగాణ, ఢిల్లీ, జమ్మూ కశ్మీర్ ప్రతిభ చూపాయి.

ఫాస్టాగ్

- జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ రహదార్లపై ప్రయాణించే వాణిజ్యేతర ప్రైవేట్ వాహనాలకు ఫాస్టాగ్ టోల్ విధానాన్ని కేంద్రం ప్రవేశపెట్టనుంది. ఈ ఏడాది ఆగస్ట్ 15 నుంచి ఇది అమల్లోకి రానుంది. ఏటా రూ. 3 వేలు చెల్లించి కార్లు, జీపులు, వ్యాన్ల యజమానులు ఏడాది పాటు లేదా 200 ట్రిప్పుల వరకు జాతీయ రహదారులపై ప్రయాణించేందుకు వీలుంటుంది. ఇప్పటికే ఫాస్టాగ్ ఉన్న వాళ్లు మళ్లీ కొత్త వాటిని కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు. పాత ఫాస్టాగ్‌లోనే టోల్‌పాస్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చు.

ఐసీఏఆర్-నిషాద్ భోపాల్

- 'రిండర్ పెస్ట్ హోల్డింగ్ ఫెసిలిటీ క్యాటగిరీ ఏ' హోదాకు భోపాల్‌లోని ఐసీఏఆర్-నిషాద్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజ్-ఎన్ఐహెచ్ఎస్ఏడీ) కేంద్రం ఎంపికయ్యింది. పశువులకు వచ్చే వ్యాధులపై పరిశోధనను ఇక నుంచి ఈ కేంద్రంలో చేపడుతారు. పారిస్ కేంద్రంగా పనిచేసే జంతు ఆరోగ్య ప్రపంచ సంస్థ, రోమ్ కేంద్రంగా పనిచేసే ఆహార-వ్యవసాయ సంస్థలు సంయుక్తంగా భోపాల్ కేంద్రాన్ని పరిశోధనకు ఎంపిక చేశాయి.

జనగణన

- 16వ జనగణనను కేంద్రం జూన్ 16న నోటిఫై చేసింది. 2027లో ఈ జనగణను చేపట్టనున్నారు. ఈసారి కులగణన ప్రక్రియను కూడా చేర్చారు. డిజిటల్ పద్ధతిలో తొలిసారిగా సమాచారాన్ని సేకరించనున్నారు.

క్రీడలు

ఐసీసీ టెస్ట్ చాంపియన్‌షిప్‌లో దక్షిణాఫ్రికా విజయం

- ఐసీసీ టెస్ట్ చాంపియన్‌షిప్‌ను దక్షిణాఫ్రికా జట్టు గెలుచుకుంది. తుది పోరులో ఆస్ట్రేలియాను ఓడించింది. ఐసీసీ టెస్ట్ చాంపియన్‌షిప్‌ను దక్షిణా ఫ్రికా గెలుచుకోవడం ఇదే తొలిసారి. తొలి టెస్ట్ చాంపియన్‌షిప్‌ను న్యూజిలాండ్, రెండోదాన్ని ఆస్ట్రేలియా గెలుచుకున్నాయి.

ఐటీఎఫ్ టోర్నీ

- భారత టెన్నిస్ క్రీడాకారిణి అంకిత రైనా, ఫ్రాన్స్‌కు చెందిన అలిస్ రోబె జోడీ ఐటీఎఫ్ మహిళల టోర్నీని గెలుచుకుంది. జూన్ 25న పోర్చుగల్‌లోని గ్యుమారెస్‌లో ఈ ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు.

శ్రీవల్లి

- టెన్నిస్‌కు సంబంధించి ప్రతిష్ఠాత్మకంగా భావించే బిల్లీ జీన్ కింగ్ కప్ హార్ట్ అవార్డ్‌ను ఈ ఏడాది శ్రీవల్లి భమిడిపాటికి ప్రకటించారు. ఈ అవార్డ్‌ను గెలుచుకున్న మూడో భారతీయురాలు ఆమె. గతంలో సానియా మీర్జా, అంకిత రైనా ఈ అవార్డ్‌ను గెలుచుకున్నారు.

తెలంగాణ

మెట్రో రెండో దశకు పరిపాలన అనుమతి

- హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ ప్రాజెక్ట్‌కు రూ. 19,579 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులను ఇచ్చింది. కారిడార్ 9లో రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 39.6 కిలోమీటర్లు, కారిడార్ 10 జేబీఎస్ నుంచి మేడ్చల్ వరకు 24.5 కిలోమీటర్లు, కారిడార్ 11లో జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు 22 కిలోమీటర్లు, మొత్తం 86.1 కిలోమీటర్ల మేర పనులను చేపట్టనున్నారు.

సింగరేణికి పురస్కారం

- సింగరేణి సంస్థ అవలంబిస్తున్న వ్యయ నియంత్రణ చర్యలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటింగ్స్ ఆఫ్ ఇండియా ఏటా మెగా పరిశ్రమల విభాగంలో ఇచ్చే జాతీయ స్థాయి తృతీయ పురస్కారానికి సింగరేణి సంస్థ ఎంపికయ్యింది.

సర్కార్ పాఠశాలల్లో బోధనకు అవగాహన

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక బోధన సేవలను ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర విద్యా శాఖ, ప్రముఖ స్వచ్ఛంద సంస్థలతో పరస్పర అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ఆ సంస్థలు..

1. నందన్ నిలేకని నేతృత్వంలోని ఏక్‌స్టెప్ ఫౌండేషన్: కృత్రిమ మేధ ఆధారిత ప్లాట్‌ఫాంతో
2. ఫిజిక్స్ వాలా: ఇంటర్ విద్యార్థులను నీట్, జేఈఈ, క్యాట్ పరీక్షలకు సన్నద్ధులను చేయడం
3. ఖాన్ అకాడమీ: రాష్ట్రంలో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు పాఠ్యాంశాలకు అనుగుణంగా వీడియో ఆధారిత స్టెమ్ శిక్షణ
4. ప్రజ్వల ఫౌండేషన్: 6-12వ తరగతి వరకు విద్యార్థులకు బాల సురక్ష, రక్షణ కార్యక్రమాలు ప్రారంభం
5. ఫైజామ్ ఫౌండేషన్: 1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు కోడింగ్, కంప్యూటేషనల్ థింకింగ్‌పై శిక్షణ.
6. ఎడ్యుకేట్ గర్ల్స్: రాష్ట్రంలో పాఠశాలలకు దూరంగా ఉన్న 16వేల మందికి పైగా పిల్లలను తిరిగి బడిలో చేర్పించడంతో పాటు బాలికల అక్షరాస్యత, విద్యా అవకాశాలను మెరుగుపరచడం.

గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్

- కొండాపూర్‌లోని గూగుల్ దివ్య శ్రీభవన్‌లో నెలకొల్పిన గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్ జూన్ 18న ప్రారంభించారు. హైదరాబాద్‌లో నెలకొల్పిన ఈ కేంద్రం ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో గూగుల్‌కు తొలి కేంద్రం, అలాగే ప్రపంచ వ్యాప్తంగా నాలుగోది. ఈ కేంద్రం సైబర్ సెక్యూరిటీ హబ్‌గా అధునాతన భద్రత సేవలను అభివృద్ధి చేస్తుంది. నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల సృష్టి, భారతదేశ భద్రత సామర్థ్యాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

కాన్సస్ వర్సిటీ-ఉద్యాన విశ్వవిద్యాలయం

- అమెరికాలోని కాన్సస్ స్టేట్ యూనివర్సిటీతో తెలంగాణ వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాలు వేర్వేరుగా అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వ్యవసాయ వర్సిటీతో ఒప్పందంలో భాగంగా డిజిటల్ వ్యవసాయ కేంద్రం ఏర్పాటుకు, సహజ వనరులు, పర్యావరణంపై పరిశోధనకు ఏఐతో సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధికి సహకరిస్తుంది. పంటల పరిశోధనకు ఉద్యాన విశ్వవిద్యాలయం ఒప్పంవం కుదుర్చుకుంది.

వార్తల్లో వ్యక్తులు

నరేంద్ర మోదీ

- ప్రధాని మోదీకి సైప్రస్ అత్యున్నత పురస్కారాన్ని అందించింది. జూన్ మూడో వారంలో ఆయన సైప్రస్, క్రొయేషియా దేశాల్లో పర్యటించారు. యూపీఐ చెల్లింపుల కోసం సైప్రస్‌తో ఒప్పందం కుదిరింది. అలాగే చెల్లింపులకు సంబంధించి గుజరాత్ గిఫ్ట్ సిటీలోని ఎన్ఎస్ఈ, సైప్రస్ స్టాక్ ఎక్స్ఛేంజీలు కూడా ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి.

అనంత చంద్రకాసన్

- అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి అనంత చంద్ర కాసన్ సారథ్యం వహించనున్నారు. ఈ పదవిని చేపట్టనున్న తొలి భారతీయ అమెరికన్ ఆయన.

వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411